దొంగనోట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ - వాంకిడి



దొంగనోట్లు తయారు చేస్తున్న మండల కేంద్రానికి చెందిన ఈర్రె గణపతిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. దొంగనోట్లు చెలామణీ చేస్తున్నాడనే సమాచారం మేరకు ఇంటికి వెళ్లి సోదాలు నిర్వహించి రూ.21.30లక్షల నకిలీ నోట్లు పట్టుకున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. దొంగ నోట్లను గుర్తు పట్టకుండా పకడ్బందీగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నాడు. దొంగనోట్ల ముఠాతో కలిసి లక్ష ఒరిజినల్ నోట్లకు బదులుగా రూ.మూడు లక్షల నకిలీ నోట్లు ఇస్తామని నమ్మించి మోసం చేస్తున్నారు. సోమవారం ఉదయం రూ.21.30లక్షల నోట్లను తరలించడానికి వెళ్తున్న క్రమంలో గణపతిని ఇంటి వద్దనే ఎస్ఐ సాగర్ పోలీస్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

అనుదినం జనపక్షం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

మంగళవారం 25 ఏప్రిల్ 2023

ఇసుక మాఫియాను అరికట్టాలి



రెబ్బెన : వంకులం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇసుక మాఫియాను అరికట్టాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లిఖార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంకులం గ్రామం నుండి ట్రాక్టర్లు, లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక రవాణా జరుగుతుంటే అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే ఇసుక మాఫియాను అరికట్టేందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి నిలేష్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ పాస్‌పుస్తకాల కోసం 28న మహాధర్నా

నవతెలంగాణ - రెబ్బెన

పెండింగ్‌లో ఉన్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులు సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను వెంటనే ఇవ్వాలని, విత్‌డ్రాలు, రుణాల కోసం పెట్టుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని 28న గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం ముందు చేపట్టే మహాధర్నాకు బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్టు కార్మికులందరు పెద్దఎత్తున తరలిరావాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం(సీఐటీయూ) కార్యదర్శి ఓదెలు కోరారు. సీఎంపీఎఫ్ పెండింగ్ పాస్ పుస్తకాల కోసం అనేకసార్లు సింగరేణి అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పెడచెవిన పెడుతున్నారన్నారు. కార్మికుల వేతనాల నుండి కట్ చేసిన సీఎంపీఎఫ్ డబ్బులు ఎవరి ఖాతాలో జమవుతున్నాయో తెలియక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సింగరేణి యాజమాన్యం డబ్బులు చెల్లించడం లేదని, రూ.55లక్షలు బకాయి ఉన్నట్టు చెప్తున్న సీఎంపీఎఫ్ అధికారులు సింగరేణి యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పని మానివేసిన, చనిపోయిన కాంట్రాక్టు కార్మికులు పెట్టుకున్న క్లైమ్‌లు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వీటి కోసం కార్మికులు మధ్య దళారీలను, బ్రోకర్లను ఆశ్రయించి మోసపోతున్నారని పేర్కొన్నారు. 2018 నుండి పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ వివరాలతో పాటు నర్సరీ, కన్వేశన్ డ్రైవర్లకు సీఎంపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 28న చేపట్టే మహాధర్నాకు కాంట్రాక్టు కార్మికులు పెద్దఎత్తున గోదావరిఖనికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఈదురు గాలులతో అకాల వర్షం



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మండలంలోని ఆడేపల్లి, డబ్బా, బాబాసాగర్‌లో సోమవారం ఈదురుగాలులతో అకాల వర్షం కురిసింది. రహదారి వెంట ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లోని ఇళ్లపై రేకులు లేచిపోయాయి. మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయం రేకులు లేచిపోయాయి.

ఓటరు జాబితాలో తప్పులు సవరించుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో తహసీల్దార్ మల్లిఖార్జున్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబుల్ ఓటర్లు(పీఎస్‌పీ) తొలగించుట, అదేవిధంగా మరణించిన వారి పేర్లు తొలగించుట, ఇతర కారణాల వల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగించడానికి, కొత్త ఓటర్ల పేర్లు నమోదు కార్యక్రమం చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఓటరు కార్డులో తప్పులు, పుట్టిన సంవత్సరం సవరణ చేయాలని తెలిపారు. వివిధ అంశాలపై తహసీల్దార్‌తో పార్టీ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేష్, దేవాజీ, బీజేపీ మండలాధ్యక్షుడు గోలెం తిరుపతి, బాలకృష్ణ, నవీన్, సీపీఐ రవీందర్, అన్నపూర్ణ, అరుణ పాల్గొన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండలంలో పనిచేస్తున్న ఐకెపి వివోఏలకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం ఇవ్వాలని ఎంపీపీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారం రోజులుగా కొనసాగుతున్న వివోఎల నిరవధిక సమ్మెకు ఎంపీపీ ఆజడే జయశ్రీ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివోఏలను సెర్ప్ ఉద్యోగులుగా పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.26వేల కనీస వేతనం అందివ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమకు మద్దతు తెలిపిన ఎంపీపీకి వివోఏలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివోఏలు సుజాత, లచ్చన్న, అశ్విని పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు

నవతెలంగాణ - రెబ్బెన

సింగరేణి ఉద్యోగం చేస్తూ మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన వారసులకు బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో అధికారులు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఐదుగురు కారుణ్య నియామక అభ్యర్థులు హాజరయ్యారు. పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు అభ్యర్థులను, వారి కుటుంబీకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సంక్షేమ అధికారి వేణు, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

టికెట్ల లొల్లి షురూ..!

- ప్రధాన పార్టీల్లో పెరిగిన ఆశావహులు
- ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా జనంలోకి
- ఈ సారి టికెట్ తమకే వస్తుందంటూ ప్రచారం
- ఎవరిని వరిస్తుందోనని కార్యకర్తల్లోనూ అయోమయం

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో టికెట్ల వ్యవహారం తారాస్థాయికి చేరుతోంది. ఆయా ప్రధాన పార్టీల్లో ప్రస్తుతం ఇదే ప్రాధాన్యంశంగా మారుతోంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని ఈ సారి తమకే టికెట్ వస్తుందని ఎవరికి వారు ప్రచారం చేస్తున్నారు. ఫలితంగా ఎవరికి టికెట్ దక్కుతుందో తెలియక ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల్లోనూ అయోమయం నెలకొంది. రాష్ట్రంలో అధికార బీఆర్ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీల్లోనూ ఈ టికెట్ల లొల్లి ప్రధాన చర్చకు దారితీస్తోంది. కొన్ని రోజులుగా ఆయా నియోజకవర్గాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలతో ఉమ్మడి జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఈ పరిస్థితి అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీల్లోనూ కనిపించడం చర్చనీయాంశంగా మారుతోంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో టికెట్ల వ్యవహారం ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయాలు రోజురోజుకు వేడుక్కుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు ఈ ఏడాది చివరలో జరిగే అవకాశం ఉండటంతో ఇప్పట్నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థులు రంగంలోకి దిగుతున్నారు. ఇప్పటికే పోటీ చేసిన అభ్యర్థులతో పాటు అనేక ఏండ్ల నుంచి పార్టీలో వివిధ పదవులు పొందినవారు, గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసినవారు, కొత్తగా చేరిన వారు సైతం రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. దీంతో ఇప్పట్నుంచే అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు పరస్పరం విమర్శలు చేసుకుంటూ జనం దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు నాయకులు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం, ఆయా గ్రామాల్లో జరుగుతున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటూ జనం దృష్టిలో పడుతున్నారు. ఎన్నికల బరిలో ఉంటామని పరోక్షంగా సంకేతాలు ఇస్తూ తమ కంటూ ఓ గ్రూపును తయారుచేసుకుంటూ పట్టణాలు, గ్రామాల్లోకి వెళ్తూ ఎవరికివారు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు.

అన్ని పార్టీల్లోనూ ఇదే చర్చ..!

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా ఏడు నెలల సమయం ఉండటంతో ఇప్పట్నుంచే ఆయా పార్టీల్లో టికెట్ల వ్యవహారం ప్రధాన చర్చగా మారుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో అందరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ ఎన్నికల నాటికి ఒకరిద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈ సారి టికెట్ రాదని ఆ పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇదే అదనుగా భావిస్తున్న పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ద్వితీయ స్థాయి నాయకులు, అధిష్టానంతో సత్సంబంధాలు కలిగినవారు టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ జనంలో ఉండే ప్రయత్నం చేస్తున్నారు. టికెట్ వస్తే పోటీలో ఉండేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలోనూ ఈ టికెట్ల సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. ఒకరిద్దరు కీలక నాయకులు ఉన్న చోట్ల తప్పితే మిగితా అన్నింటిలోనూ టికెట్ల కోసం నాయకులు పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది. ఒక్కో నియోజకవర్గంలో రెండు, మూడు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు చేస్తుండటం.. ఈ సారి టికెట్ తమకే వస్తుందని.. కచ్చితంగా అసెంబ్లీ బరిలో ఉంటామని ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లోనూ అయోమయానికి దారి తీస్తోంది. బీజేపీలోనూ ఈ టికెట్ల వ్యవహారం ప్రధాన చర్చగా కనిపిస్తోంది. ఆయా నియోజకవర్గాల్లో రెండు, మూడు గ్రూపులు ఉండటం ఎవరికి వారు విడిగా కార్యక్రమాలు చేస్తుండటం వంటి పరిణామాలు కనిపిస్తున్నాయి. ఎవరికి వారు గ్రూపులుగా విడిపోయి కార్యక్రమాలు చేస్తుండటంతో అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయిస్తుందో..ఎవరు పోటీలో ఉంటారో తెలియక ఆ పార్టీ కార్యకర్తల్లోనూ అయోమయం నెలకొంది.

కొత్తవారూ సమాయత్తం..!

ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పలువురు కొత్త వ్యక్తులు కూడా పోటీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఇది వరకు స్వతంత్రంగా బరిలో నిలిచిన వారితో పాటు కొత్తగా వివిధ సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న వారు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజలకు తమ ఆకాంక్షను తెలియజేస్తున్నారు. వీరితో పాటు వివిధ రకాల ఉద్యోగాలు చేస్తున్న వారు, ఎన్ఆర్ఐలు, రిటైర్డ్ అధికారులు, ఆయా పార్టీల అగ్రనేతలతో పరిచయం కలిగినవారు, వివిధ సామాజిక వర్గాల్లో మంచి పట్టు కలిగిన వారు కూడా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రధాన పార్టీల టికెట్ల కోసం ఇప్పట్నుంచే ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వాటిలో టికెట్లు దక్కకపోతే ఇతర పార్టీల నుంచి రంగంలోకి దిగాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

రేపటి రేవంత్‌రెడ్డి పర్యటన విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగులకు అండగా టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఉద్యమిస్తున్నారని డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్, మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఈ నెల 26న రేవంత్‌రెడ్డి పాల్గొననున్న కార్నర్ మీటింగ్ విజయవంతంపై సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జన సమీకరణ, ర్యాలీ తదితర అంశాలపై చర్చించారు. 26న రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్‌కు రానున్నారని, మావల బైపాస్ వద్ద ఆయనకు ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ చౌక్ నుండి ర్యాలీ ప్రారంభమై పట్టణ ప్రధాన వీధుల గుండా కొనసాగుతుందని పేర్కొన్నారు. తిరిగి అంబేద్కర్ చౌక్ వద్దనే కార్నర్ మీటింగ్ ఉంటుందని వివరించారు. కార్యక్రమ విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నిరుద్యోగ సమర భేరి సభ ఆదిలాబాద్ ఇంచార్జ్, నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడు మానాల సుభాష్‌రెడ్డి, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్, ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ డా.నరేష్ జాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు సత్తు మల్లేష్, గంద్రత్ సుజాత, వెడ్మ బొజ్జు పటేల్, మర్సకోల సరస్వతి, ఆదిలాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్, బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, పత్తి రాజేశ్వర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా జడ్పీటీసీ ఫోరమ్ అధ్యక్షుడు ఆనంద్‌రావ్ పాటిల్, ముధోల్ నియోజకవర్గ నాయకులు ఎంబడి రాజేశ్వర్, జిల్లా కాంగ్రెస్ సేవాదల్ చైర్మన్ కొమురం కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఎర్రకోటపై ఎగిరేది బీఆర్ఎస్ జెండానే : దివాకర్‌రావు



నవతెలంగాణ - హాజీపూర్

వచ్చే ఎన్నికల్లో ఎర్రకోట మీద బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. సోమవారం వేంపల్లి పద్మావతి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం జరగబోయే నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధుల సభను విజయవంతం చేయాలని కోరారు. దీనికి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. 27న పార్టీ ఆవిర్భావ ప్లీనరీ కోసం ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్, దండే విఠల్, ఎంపీ వెంకటేష్ నేత హాజరుకానున్నట్లు తెలిపారు. దేశం బీఆర్ఎస్ వైపు చూస్తోందన్నారు. రాష్ట్రంలోని పథకాలు దేశంలో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. డబ్బు, అధికార దాహంతో బీజేపీ దేశంలో 9రాష్ట్రాల్లో దొడ్డి దారిన అధికారం చేజిక్కించుకుందన్నారు. బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. రేపటి సభలో కేంద్ర సర్కారు బీజేపీ సింగరేణిని ప్రైవేటీకరణ చేసే విధానాన్ని అడ్డుకునేందుకు తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భుమేష్, పీఏసీఎస్ చైర్మన్ సందేల వెంకటేష్, మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు బాపు, నడిపెల్లి ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, మందపల్లి శ్రీనివాస్, గాదే సత్యం, బింగి ప్రవీణ్, ఓలపు రమేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సరిచూసుకోవాలి

నవతెలంగాణ - పెంచికల్‌పేట్



గ్రామాల్లో నూతనంగా వచ్చిన ఓటరు జాబితాలో ఏమైన తప్పులుంటే వెంటనే ఓటర్లు సరిచూసుకోవాలని తహసీల్దార్ సరిత అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఏమైన తప్పులుంటే సరిచూసుకోవాలని, సవరణకు బీఎల్ఓలను సంప్రదించాలని తెలిపారు. 18 ఏండ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోతపెల్లి సర్పంచ్ దాసరి చంద్రమౌళి, బీఎస్పీ మండలాధ్యక్షుడు పాగిడె ఆశన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అత్తాహబేగ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన



నవతెలంగాణ-బాసర

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్జీయూకేటీ ప్రధాన గేటు వద్ద సోమవారం హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళన చేపట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ పిఎఫ్, ఈఎస్ఐ సొమ్మును జమ చేయక, వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది విధులు మానేసి ఆందోళన బాట పట్టారు. సంబంధిత కాంట్రాక్టర్ వచ్చి తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని పేర్కొంటూ ప్రధాన గేటు వద్దే నిరసన కొనసాగించడంతో కాంట్రాక్టర్ వచ్చి హౌస్ కీపింగ్ సిబ్బందితో చర్చలు జరిపారు. సిబ్బందిని విధుల్లోకి రావాలని కోరారు. ఆందోళనకు కారణమైన ఐదుగురిని బహిష్కరిస్తూ మెమో జారీ చేయడంతో మిగతా సిబ్బంది విధుల్లోకి వెళ్లకుండానే కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసేందుకు తరలివెళ్లారు. రెండు సంవత్సరాల క్రితం విధుల్లోకి చేరిన హౌస్ కీపింగ్ సిబ్బందికి సైతం వేతనాలు పెంచాలని, పిఎఫ్ ఈఎస్ఐ డబ్బులు అందజేయాలని వారు డిమాండ్ చేశారు. హౌస్ కీపింగ్ సిబ్బంది ఆందోళనకు సర్పంచ్ లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు సంఘీభావం తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బంది సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హౌస్ కీపింగ్ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను కాంట్రాక్టర్ నెరవేర్చాలని, కార్మిక చట్టాలకు అనుగుణంగా హౌస్ కీపింగ్ సిబ్బందికి వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

నర్సరీ కూలీలకు కూలి రేట్లు పెంచాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ అటవీ నర్సరీలో పనిచేస్తున్న కూలీలకు రోజువారి కూలి రేట్లు రూ.600కు పెంచాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట కూలీలతో కలిసి ధర్నా నిర్వహించి కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఫారెస్ట్ నర్సరీలో పనిచేస్తున్న వారికి ప్రతిరోజు కూలి రూ.600 చెల్లించాలన్నారు. కార్మికులకు రవాణా ఖర్చులు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెల 5లోపు వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ.20లక్షలు చెల్లించాలని, ఈఎస్ఐ, పిఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, సుధాకర్, నాయకులు ఆనంద్, సంఘమిత్ర, కౌసల్య, మాయ, సుజాత, సుధాకర్, యశోద, ప్రమీల, మల్లమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి : డీఈఓ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మన ఊరు మన బడి పథకం అమలులోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు చేకూరుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని డిఈఓ ప్రణిత అన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఎండలో తిరగకుండా ఇంటిపట్టున ఉండి నీడలో ఆడుకోవాలని, ఉపాధ్యాయులు ఇచ్చిన లైబ్రరీ పుస్తకాలు చదువుకోవాలని, చెరువులు కుంటల దగ్గరికి వెళ్లకూడదని, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. సోమవారం పాఠశాలలకు చివరి పనిదినం అయినందున జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 1 - 9 విద్యార్థుల ఫలితాలు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రకటించాలనే ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఆమె వెంట సెక్టోరల్ అధికారి జె.నారాయణ, సీసీ రాజేశ్వర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాబ్‌కార్డ్ ఉన్న ప్రతి కూలికి పనులు కల్పించాలి



నార్నూర్ : జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కూలికి ఉపాధి హామీలో పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందిని అదనపు డీఆర్‌డీఓ రవీందర్ రాథోడ్ సూచించారు. సోమవారం గాదిగూడ మండలంలోని సావరి, పిప్రి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మస్టర్‌ను తనిఖీ చేసి కూలీల వివరాలను సేకరించారు. పని చేయని కూలీల పేర్లు మస్టర్ లో నమోదు చేయవద్దని, అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉపాధి హామీ సిబ్బందితో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఆయన వెంట ఏపిఓ పవార్ నితిన్, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కడెం

కడెం మండలం కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలోని సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేశ్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ఎక్కువగా ఆదివాసీ, గిరిజనులు కడెం మండలంలో ఉన్నారని అన్నారు. ఈ ఆస్పత్రికి వైద్యం కోసం వస్తే సమయానికి డాక్టర్లు కానీ, సిబ్బంది ఉండరని ఆరోపించారు. మండల ప్రజలు వైద్యం అందక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 30 పడకలు ఉన్న ఆస్పత్రిలో సరిపడ గదులు, సిబ్బంది లేరని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

అర్హులైన ప్రతి ఒక్క కూలీకి ఉపాధిహామీ పనులు కల్పించాలని ఎంపీడీఓ పుష్పలత అన్నారు. సోమవారం మండలంలోని శంకర్‌గూడ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. రైతులకు ఉపయోగపడే పనులు, నీటి నిల్వ చేసే పనులను డిమాండ్‌లో నమోదు చేయాలని అన్నారు. కూలీలు పనులు చేసే చోటనే మాస్టర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతే గాక పనులు చేసే చోట కూలీలకు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్ ను అందుబాటులో ఉంచాలని అన్నారు. వడదెబ్బ తగలకుండా వేకువ జామునే పనికి వెళ్లాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె వెంట టీఏ పృథ్వీరాజ్, మేట్ గజానంద్ గుట్టే ఉన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



పట్టణంలోని సుభాష్‌నగర్‌లో మిషన్ భగీరథ నీరు అందక పోవడంతో కాలనీవాసుల విన్నపం మేరకు మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, కమీషనర్ రత్నాకర్‌రావు సోమవారం ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కల్పించారు. నిత్యం ట్యాంకర్ ద్వారా సరఫరా అయ్యే నీరును కాలనీ ప్రజలు పొదుపుగా వాడుకోవాలని చైర్మెన్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు షబ్బీర్ పాషా, సలీం ఖాన్, నారాయణ, మన్సిపల్ సిబ్బంధి పాల్గొన్నారు.

వీఓఏలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-నార్నూర్

వీఓఏల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించి నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పవార్ విజయ్, మండల అధ్యక్షుడు వాగ్మారే గోవింద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మెలో పాల్గొని వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామ స్థాయిలో 17,605 మంది వీఓఏలు గ్రామ సంఘ సహాయకులుగా పని చేస్తున్నారని అన్నారు. గత 20 సంవత్సరాల నుండి గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఐకేపీ వీఏఓలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈ సమ్మెలో వీఓఏలు శారదబాయి, చిత్రు, తాతేరావు, దోండుబాయి, పరమేశ్వర్, విద్యాన్, కాంతా బాయి, మాన్కు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

బీఆర్‌ఎస్ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25న వినోద్ రావు స్టేడియంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్లీనరీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. పార్టీ బాద్యులు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మొదటగా పార్టీ గ్రామ అధ్యక్షులు గ్రామపంచాయతీలలో ఉదయం 8:30 గంటలకు జెండాను ఆవిష్కరించి, అనంతరం 10:30 గంటలకు నియోజకవర్గ కేంద్రంలోని వినోద్‌రావు స్టేడియంలో నిర్వహించే ప్లీనరీ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి :ఎంపీపీ

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రతి ఒక్కరూ కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. సారంగాపూర్ మండలంలోని యకర్‌పల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం గ్రామ సర్పంచ్ రమణ యాదవ్‌తో కలిసి కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అందత్వ రహిత రాష్ట్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం కేసీఆర్ ఉచిత కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. కంటి పరీక్షలు చేసుకొని కంటి చూపును మెరుగు పర్చుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, గ్రామ ఉప సర్పంచ్ సాయేందర్, వైద్యులు వేదవ్యాస్, అలీ, సూపర్‌వైజర్‌లు కెఎం గౌడ్, సరస్వతి, హెల్త్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, ఎఎన్‌ఎంలు ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలో సోమవారం సర్పంచ్ బాగుబాయి కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యురాలు ప్రియాంక, అప్తాల్మిక్ అసిస్టెంట్ సంధ్యరాణిలు కంటి సమస్యలున్న వారికి కంప్యూటరైజ్డ్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు మందులను అందజేశారు. మరికొందరికి దష్టి లోపం ఉండటంతో కంటి అద్దాలకు వారి పేర్లను నమోదు చేశారు. ఈ వైద్యశిబిరంలో సెక్రటరీ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు సుగుణ, సముద్ర, హెచ్‌ఏలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

నియోజకవర్గ కేంద్రంలోని పాత దవాఖానా స్థలం కబ్జాకు గురవుతుందని, అట్టి స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డికి వీడీసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో ఉన్న స్థలం ఆక్రమణ గురవుతుందని వెంటనే ప్రభుత్వం స్పందించాలని విన్నవించినట్లు వారు పేర్కొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మెన్ ఖలీల్‌తో పాటు వీడీసీ సభ్యులు కల్వకుంట్ల వెంకటేశ్వరరావు, బీసీ రాజన్న, లక్ష్మణరావు, సురేష్ కుమార్, బక్క శెట్టి లక్ష్మణ్, కే.గంగారావు, కటిక శ్రీనివాస్ ఉన్నారు.

కడెం ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-కడెం

మండలంలోని చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన గోపు సుహాని అనే నాలుగేళ్ల చిన్నారిని ఆదివారం కుక్క కరవడంతో కుటుంబ సభ్యులు కడెం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అయితే మధ్యాహ్నం ఆ ఆస్పత్రిలో సిబ్బంది ఎవరు లేకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యం వహించారని చిన్నారి కుటుంబ సభ్యులు దాదాపు 2 గంటలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజేందర్ ఆస్పత్రిని తనిఖీ చేసి ఏఎన్‌ఎం రాజు, ఏఎన్‌ఎం ఉమారాణి ఇద్దరికీ మెమోలు జారీ చేశారు.

వేసవి శిక్షణల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (42) వేసవిలో ట్రైనింగ్ కోర్స్ హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ జిల్లాలో మార్చి ఒకటి నుండి జూన్ 11 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు అడ్మిషన్ల కొరకు ఈనెల 30 వరకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు బీఎస్‌ఈ.తెలంగాణ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

కళ తప్పిన గిరిజన దర్బార్

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గిరిజన దర్బార్‌కు కళ తప్పుతోంది. ఐటీడీఏ పీఓగా రెగ్యులర్ అధికారి లేకపోవడంతో తమ సమస్యలను పరిష్కరిస్తారో లేదోనని గిరిజనులు కలతతో ఐటీడీఏకు రావడం మానేశారు. అత్యవసర పరిస్థితుల్లో పదుల సంఖ్యలో వచ్చే గిరిజనులు తమ గొడును వెల్లబోసుకుంటున్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పదుల సంఖ్యలో వచ్చి గిరిజనులు అర్జీలను అందించేందుకు వచ్చి అధికారులను కలిసి ధరఖాస్తులు పెట్టుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దర్బార్‌లో ఓఎస్డీ క్రిష్ణయ్య, పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, ఏఓ రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీఓ ప్రవీణ్, అధికారులు ఉన్నారు.

మేడే వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్



మేడే వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 136 సంవత్సరాలుగా మేడేను ఒకరోజు మాత్రమే నిర్వహించి, కార్మిక ఐక్యతను ప్రదర్శించారని అన్నారు. కానీ చికాగో అమరవీరుల స్ఫూర్తిని కార్మికుల హక్కులను నీరుగార్చడానికి కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొలగించిన 4 లేబర్ కోడుల ద్వారా బహుళజాతి సంస్థలకు లాభాలను చేకూర్చే విధంగా పూనుకున్నదని విమర్శించారు. ఆనాటి మేడే స్ఫూర్తితో పనిగంటల తగ్గింపుతో పాటు అనేక కార్మిక చట్టాలు వివిధ సందర్భాల్లో కార్మిక పోరాటాల ద్వారా రూపొందించబడ్డాయని అన్నారు. అనేక కార్మికుల రక్తతర్పణాలు, త్యాగాలు, కేసులు, నిర్బంధాలు, జైలు జీవితం ద్వారా కార్మిక చట్టాలను సాధించుకున్నామని అన్నారు. నాడు దేశభక్తియుత పోరాటంలో పాల్గొనని బీజేపీ ప్రభుత్వం దేశభక్తి పేరు చెప్పుకొని అంతర్జాతీయ బహుళజాతి సంస్థలకు కార్మికవర్గ హక్కులను అప్పనంగా అప్పజెప్పేందుకు పనిగంటలను తొలగించిందని అన్నారు. ఈ మేడే మే 1 నుండి 3 వరకు వారోత్సవాల ద్వారా కార్మికుల్లో ప్రత్యామ్నాయ శ్రమ సంస్కృతిని పెంచే విధంగా కార్యక్రమాలు రూపొందించుకోవాలని తెలియజేశారు. మేడే దినం సెలవు దినం కాదని, వినోద దినం కాదని, అవార్డులు, రివార్డుల కోసం మేడే జరుపకుండ చికాగో అమర వీరుల ఫొటోస్ పట్టుకొని ర్యాలీలు, సభలు నిర్వహించాలని తెలియజేశారు. మేడే జెండా ఆవిష్కరణ సందర్భంగా మత సాంప్రదాయాలకు తావు లేకుండా జెండా ఆవిష్కరణలు, మహిళా కార్మికులతో చేయించాలని అన్నారు. కార్మిక సమానత్వాన్ని, సమాన పనికి సమాన వేతనం, సమాన హక్కులు పురుషునితో పాటుకు స్త్రీలకు కూడా ఉంటున్నాయని అన్నారు. ఈ మేడే సందర్భంగా కార్మికవర్గానికి వివరించాలని తెలియజేశారు. సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేల్లి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రాజమణి, లలిత, రజియా, జిల్లా సహాయ కార్యదర్శి స్వర్ణలత, శైలజ, విజయ, లావణ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాకూరి తిరుపతి, మురళి, సత్యనారాయణ, కమాండ్ వెస్లీ పాల్గొన్నారు.

ఐకేపీ మహిళా సమాఖ్యలకు ట్రాక్టర్‌ల అందజేత

- ఐకేపీ కస్టమ్ హైరింగ్ సెంటర్‌కు ట్రాక్టర్లను అందజేసిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



నవతెలంగాణ-తాంసి

తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల ఐకేపీ మహిళా సమాఖ్యలకు సోమవారం తాంసి మండల సమాఖ్య కార్యాలయంలో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ట్రాక్టర్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా ఈ రోజు అందించిన ట్రాక్టర్లను అభివృద్ధి పథంలో నడిపించి వచ్చిన లాభాలను పొదుపు చేసి, మండల సమాఖ్యను అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. అలాగే భీంపూర్ మండల సమాఖ్య 371 సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.17లక్షల 25వేలు, తాంసి మండల సమాఖ్య సంఘాలకు రూ.24లక్షల 73వేలు, తలమడుగు మండల సమాఖ్య సంఘాలకు రూ.48లక్షల 8వేల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కప్పర్లలో కమ్యూనిటీ హల్‌కు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీలు రాజు, సుధాకర్, ఎంపీపీ మంజులశ్రీధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రేఖారఘు, మండల కన్వీనర్లు వెంకటేష్, అరుణ్, నాగయ్య, బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, సర్పంచ్ కృష్ణ, వెంకన్న, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాస్, వైస్ చైర్మెన్ ధనుంజయ్, నాయకులు మహేందర్, సదానందం, ప్రకాష్, దాసు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీ పట్టివేత

- 250 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం
- బీహార్ నుంచి జగిత్యాల జిల్లాకు వస్తున్నట్టు తప్పుడు పత్రాలు
- వివరాలను వెల్లడించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లోడ్‌తో ఉన్న లారీని ఆదివారం రాత్రి మండలంలోని బాదన్‌కుర్తి చెక్ పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ లారీని రెవెన్యూ అధికారులకు అప్పజెప్పడంతో సదరు అధికారులు విచారణ చేపట్టి లారీలో తరలిస్తున్న బియ్యం ప్రభుత్వ ప్రజా పంపిణీకీ చెందినవిగా నిర్ధారించారు. డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి.హనుమాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఏపీ-02టీఈ-0999 నెంబర్ గల లారీలో 250 క్వింటాళ్లు (500 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేసుకొని జగిత్యాల జిల్లాకు తరలిస్తున్నారు. ఆదివారం సాయంత్రం బాదన్‌కుర్తి చెక్ పోస్టు వద్ద స్పెషల్ బ్రాంచ్ పోలీసులు తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానం వచ్చి లారీని ఆపారు. బియ్యం లోడ్‌కు సంబంధించిన వేబిల్స్ డ్రైవర్ వద్ద లేకపోవడంతో అనుమానం కలిగి పోలీసులు సదరు లారీని రెవెన్యూ శాఖ అధికారులకు అప్పగించారు. డీఎస్‌ఓ సూచనల మేరకు లారీలోని బియ్యాన్ని పరిశీలించగా సదరు బియ్యం ప్రభుత్వ ప్రజాపంపిణీకి చెందినవిగా తేలింది. సదరు లారీ డ్రైవర్ వద్ద ఒరిజినల్ వేబిల్ కాకుండా బీహార్ నుంచి జగిత్యాల జిల్లా లోని ఓరైస్ మిల్‌కు తరలిస్తున్నట్టు తప్పుడు పత్రాలు ఉన్నాయని, వాటిని స్థానికంగా అప్పటికప్పుడు సృష్టించినట్టు ఉన్నాయని వివరించారు. పట్టుబడ్డ సదరు బియ్యం బస్తాలను స్థానిక పౌరసరఫరాల గిడ్డంగిలో నిల్వ చేశారు. ఖాళీ లారీని పోలీసులకు అప్పగించినట్టు తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కడెం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై భీంరావు అన్నారు. సోమవారం మండలంలోని చిన్న బెల్లాల్, పెద్ద బెల్లాల్, కన్నాపూర్ గ్రామాల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ మీ ఫోన్‌కి గుర్తు తెలియని వ్యక్తుల నెంబర్ నుండి కాల్స్‌గాని మెసేజ్ గాని వచ్చినట్టయితే మీ మొబైల్ సంబంధించిన ఓటీపీ కానీ, మీ వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దని అన్నారు. సైబర్ నేరగాళ్లు నూతన టెక్నాలజీని వాడుకుంటూ చాలా డిజిటల్ మోసాలు చేస్తున్నారలని అన్నారు. వాటి పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. వాహనం నడిపేటపుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. వాహనం నడుపుతున్నప్పుడు ప్రతిఒక్కరూ విధిగా రోడ్డు నియమాలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటి కాలిపై ఐకేపీ వీఓఏల నిరసన

నవతెలంగాణ-సారంగాపూర్



ఒంటి కాలిపై నిలబడి ఐకేపీ వీఓఏలు నిరసన తెలిపారు. ఐకేపీ వీఓఏల సమ్మెలో భాగంగా సోమవారం సమ్మెశిబిరంలో ఒంటికాలుపై నిలబడ్డారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని, తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రూ. 10 లక్షల సాధారణ భీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. శోభ, దీప లావణ్య పాల్గొన్నారు.

కుభీర్: తెలంగాణ ప్రభుత్వం ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో చేపట్టిన సమ్మెలో భాగంగా వీఓఏలు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పనిచేస్తున్న వీఓఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేలా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా వీఓఏలకు కనీస వేతనం రూ.26వేలతో పాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. అదేవిధంగా అర్హులైన వీఓఏలకు సీసీలుగా నియమించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే వీఓఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనియెడల ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు సాయినాథ్, మంజుల, శ్రీలక్ష్మి, భోజన్న, నాందేవు లతిప్ ఉన్నారు.

సమనుజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమనుజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం డిపో మేనేజర్ కల్పన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం కల్పన మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని, బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ట్రస్ట్ సభ్యులను అభినందించారు. ఈ చలివేంద్రాన్ని ప్రయాణికులు, వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, ట్రస్ట్ సభ్యులు కె.విశ్వనాథ్, ఆర్టీసీ అకౌంటెంట్ మోహన్, ఏఎస్ రావు, మోతే సుధాకర్, ఆర్టీసీ ఎయిర్‌బస్ స్టేట్ సెక్రటరీ తిరుపతిరెడ్డి, నిర్భయ్ కుమార్, తారాబాయి, షిబాని పట్నాయక్, మనీషా, రాధిక పాల్గొన్నారు.

పంగిడి చెరువు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలోని దాస్ నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పంగిడి చెరువు మరమ్మతు పనులకు ఎంపీపీ మోహిద్ సోమవారం భూమిపూజ చేశారు. గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు చెరువుకు గండి పడటంతో ప్రభుత్వం మరమ్మతు పనుల కోసం రూ.15 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. రానున్న ఖరీఫ్ వరకు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విశేష్, నాయకులు చిన్నం రవీందర్, మల్లేశ్, నీటిపారుదల శాఖాధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

తరోడ బ్రిడ్జి, నిరాల నుంచి లాండసాంగ్వి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రాష్ట్రం ప్రభుత్వం రూ.40కోట్ల 24లక్షలు మంజూరు చేయడంతో సోమవారం మండలంలోని లింగుగూడ, అర్లి గ్రామాల్లో గ్రామస్తులు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ప్రకృతి వైపరీత్యంతో తరోడ బ్రిడ్జి శిథిలావస్థ దశలో ఉండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై ఎమ్మెల్యే జోగు రామన్న కృషితో నిధులు మంజూరు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వినోద్, లక్ష్మణ్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం నిధులకు, రాష్ట్ర నిధులకు తేడా తెలియని ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నకు కేంద్రం నిధులకు, రాష్ట్ర నిధులకు తేడా తెలవకుండా మంత్రి ఎలా అయ్యారోనని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. అంతర్గత గ్రామాల రోడ్డు విస్తరణకు రూ.40 కోట్లు మంజూరు చేసినందుకు గాను లాండసాంగి గ్రామంలో నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న కనీస అవగాహన లేకుండా కేంద్రం నుంచి విడుదలైన సీఆర్‌ఎఫ్ సెంట్రల్ రోడ్ ఫండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. తరోడ వద్ద బ్రిడ్జి కూలిపోయినందున వాహనాల రాకపోకలను దారి మళ్లించి నిరాల, ఆడ, లాండసాంగి మీదుగా ఆదిలాబాద్‌కు రాకపోకలు కొనసాగుతున్నాయని అన్నారు. దీని ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న రోడ్డు భారీ వాహనాలకు తట్టుకోలేక రెండు నెలల్లోనే నామరూపాలు లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితిని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ పార్లమెంటు సభ్యులు సోయం బాపూరావు, బండి సంజయ్ పలుమార్లు లేఖల ద్వారా వీడియో క్లిప్షల ద్వారా నరేంద్రమోడీకి తెలియజేశారని అన్నారు. స్పందించిన నరేంద్రమోడీ రూ.40 లక్షల మంజూరు చేశారని అన్నారు. ఈ రోడ్డును రెండు వరుసలుగా మార్చి అభివృద్ధి చేయడానికి మంజూరు చేశారు. కేంద్రం నుంచి విడుదలైన నిధులకు సంబంధించిన ఆర్డర్ కాపీ వచ్చిందో ఆ వెంటనే ప్రతి మొబైల్‌కి సెల్ ఫోన్‌కి ఆ లెటర్ కాపీ చేరిందని అన్నారు. విషయం తెలియని జోగు రామన్న ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందంటూ ప్రచారం చేసుకుని అభాసుపాలయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంతోష్, అధినాథ్, జోగు రవి, ఆకుల ప్రవీణ్, రత్నాకర్‌రెడ్డి, చిలుకూరి జ్యోతిరెడ్డి, కిష్టు, ధోని జ్యోతి, విఠల్, మహేందర్, ముకుందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

26న కాంగ్రెస్ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టే నిరుద్యోగ ర్యాలీని విజయవంతం చేయాలని బోథ్ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 26న చేపట్టే నిరుద్యోగ ర్యాలీకి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నిరసన ర్యాలీలో పాల్గొంటున్నారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కర్నార్ మీటింగ్ ఉంటుందని తెలిపారు బోథ్ నియోజకవర్గ నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై నిరసన ర్యాలీ, కర్నార్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, నాయకులు భీముడు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్‌కె-1ఏ గని మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



బదిలీపై వెళ్తున్న ఆర్‌కె-1ఏ గని మేనేజర్ శ్రీధర్ రావుకు సోమవారం టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నాయకులు ఆ గనిపై ఘనంగా సన్మానించారు. ఆర్‌కె-1ఏ గని నుంచి శ్రీరాంపూర్‌కి ఎస్‌ఓ టూ జీఎం బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏరియా నాయకులు శంకరావు, గని ఫిట్ సెక్రటరీ బండారి బిక్షపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు సేఫ్టీ కమిటీ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అక్బర్ అలీ ఏఐటీయూసీ గని పిట్ సెక్రటరీ సురమళ్ల వినయ్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ గోవిందుల రమేష్ పాల్గొన్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-దండేపల్లి



ఇటీవలే అకాల వర్షానికి నష్టపోయిన పంటలను మండల వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. సోమవారం మండలంలోని మాకులపేట గ్రామంలో నష్టపోయిన వరి పంటను పరిశీలించి ఆయన మాట్లాడారు. అకాల వర్షానికి నష్టపోయిన పంటలను నష్టమంచన వేసి ఉన్నత అధికారులకు నివసిస్తామని రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని ఆయన తెలిపారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అధికారులు రైతు సమన్వయ సమితి నాయకులు ఉన్నారు.

బుడగ జంగాల కాలనీలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామపంచాయతీ పరిధిలోని బుడగ జంగాల కాలని, సుందరయ్య నగర్ కాలనిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం జన్నారంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సుందరయ్య నగర్ కాలని, బుడగ జంగాల కాలని నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సంఖ్య రవి మాట్లాడుతూ ఈ కాలనిలో మురుగునీరు, విద్యుత్తు మంచినీటి సరఫరా రోడ్ల సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆ కాలని ఏర్పడి 15 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎక్కడ వేసిన సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికారం అశోక్, కే బుచ్చయ్య, కొండగుర్ల లింగన్న, పి.రాజన్న, మగ్గిడి జయ, ప్రమీల బేబీ పద్మ పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని రవిచంద్ర కాలనీలో నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ బేడ బుడగ జంగాలకు చెందిన వారికి ఇండ్ల స్థలాలు కేటాయించాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు ఆత్మరామ్ నాయక్ అదనపు కలెక్టర్ రాజేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కాలనిలోని ప్రభుత్వ భూమిలో ఎస్టి బేడ బుడగ జంగాల వారు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, ప్రస్తుతం పోలీసులు వారిని కాళీ చేయమంటున్నారన్నారు. వారికి ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్, రాజేష్, నరేష్, రాజు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రయివేటు కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో పకడ్బందీగా ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. ప్రయివేటు యజమాన్యాలు విద్యా పేరుతో వ్యాపారం చేస్తున్నారని, రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ప్రభుత్వం నుండి అనుమతులు రాకపోయినా విద్యార్థుల అడ్మిషన్ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం పై గతంలో అనేక సార్లు విన్నవించిన ఫలితం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కార్పొరేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నస్పూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు బండి సత్యనారాయణ, ఈదూనూరి అభినవ్, మండల నాయకులు రాకేష్, అభినవ్, హితేష్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో వంతెన అందుబాటులోకి తేవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న వర్షకాలంలోపు గుండి వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆసిఫాబాద్ ఎంపీపీ మల్లికార్జున్ సూచించారు. వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు చెప్పినట్లు వర్షాకాలంలోపు వంతెన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వంతెన లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిని గుర్తించి వంతెన నిర్మాణ పనులు వేగవంతం చేసేలా కాంట్రాక్టర్ పై ఒత్తిడి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, సింగిల్విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరి మంగపెంటయ్య నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన గోపతి రాజవ్వ(72) అనే వృద్ధురాలు ప్రమాదవశత్తు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు దండేపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజవ్వ రోడ్డుకు అవతలి వైపు గల వారి ఇంటికి వెళ్ళి తిరిగి వస్తుండగా రోడ్డు పక్కన వెలుతుండగా విద్యుత్ తీగలు ఆమెపై తెగి పడడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వచ్చే సరికి రాజవ్వ మృతిచెందింది. ఈ మేరకు మతురాలు రాజవ్వ కుమారుడు శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



ఐకేపీ వీఓఏల పట్ల వివక్ష విడనాడాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-తాండూర్

ఐకేపీ వీఓఏల పట్ల ప్రభుత్వం వివక్ష విడనాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. మండలంలో ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెకు సోమవారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లోని మహిళలను సంఘటిత పరుస్తూ మహిళా సమగ్రాభివృద్ధికి తోడ్పడుతున్న వీఓఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26,000 వేలు ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా ప్రమోట్ చేయాలన్న డిమాండ్లను పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో వీఓఏలు చేసే పోరాటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాగం రాజారాం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొట్ట పోషం ఐకేపీ వీఓఏల సంఘం (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షులు అలీ వెంకటేష్, సురేష్, జనార్ధన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఇబ్బందులు కల్గకుండా జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ రాజేశం, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు ఆత్రం సక్కుతో కలిసి జాతీయ రహదారుల శాఖ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పనులు తుది దశకు చేరినందున రహదారులకు అనుసంధానమైన వంతెనల నిర్మాణ పనులను వర్షాకాలం వచ్చేలోగా పూర్తి చేసేందుకు అధికారులు కార్యచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. గ్రామాలలో ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రోడ్డు పనులు పూర్తి చేయాలని తెలిపారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులలో భాగంగా ఆసిఫాబాద్ మండలంలోని రాజురా, వాంకిడి మండలంలోని దాబా గ్రామాల నుండి మట్టి తరలించినందున దెబ్బతిన్న రహదారుల పనులను త్వరగా పూర్తిచేయాలని, బైపాస్ రోడ్డు పనులు పూర్తయిన తర్వాత జిల్లా కేంద్రంలోని రహదారుల పనులు చేపట్టాలని అన్నారు. రెబ్బెన, వాంకిడి మండలాలలో రోడ్డు పనులను పూర్తి చేయాలని, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో గుండి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, అంతవరకు ప్రజలకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రామ్మోహనరావు, డీఈ కృష్ణ పాల్గొన్నారు.



న్యాయ సలహా కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ జిల్లా జడ్జి రవీంద్ర శర్మ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి రవీంద్రశర్మ అన్నారు. జిల్లా కేంద్రాల్లోని జనకాపూర్‌లో ఏర్పాటుచేసిన వ్యవసాయ న్యాయ సలహా కేంద్రాన్ని మంచిర్యాల జిల్లా జడ్జి సత్తయ్య, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమకు ఎదురయ్యే వివిధ సమస్యలను, ప్రతికూల పరిస్థితులకు న్యాయ సలహా కేంద్రంలో సలహాలు సూచనలు తీసుకుని తమ సమస్యలకు పరిష్కరించుకోవాలని సూచించారు. మనకు ఎదురయ్యే ఎలాంటి సమస్యకైనా న్యాయపరమైన పరిష్కారం లభిస్తుందన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించబడడం లేదని ఆత్మహత్యలను చేసుకోకూడదని సమస్యలపై న్యాయపరంగా పోరాటం చేసి విజయం సాధించాలని అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ బాబు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దివాస్ వేడుకలు

నవతెలంగాణ-వేమనపల్లి

ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దివాస్‌ను ఎంపీడీఓ లక్ష్మయ్య, తహసీల్దార్ రాజ్ కుమార్ ఎంపీఓ బాపురావు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ చట్టం 1992 ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో అందుబాటులోకి తేవడానికి పంచాయతీరాజ్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మహాత్మా గాంధీ చెప్పినట్టు పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు, గ్రామాలు అభివృద్ధి చెందుతేనే దేశం అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ర్యక్రమంలో ఎపీఓ సత్యప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.





చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు డుబ్బుల వెంకన్న పాల్గొని మాట్లాడారు. 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ ముందుకెళ్లడంతో పాటు, 1993 జూన్ 1 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. పంచాయతీరాజ్‌లో భాగంగా పదిమంది కూర్చున్న దాన్నే, పంచులను కలుపుతూ, పంచాయతీరాజ్ అనే పంచాయతీ వ్యవస్థ అని తెలిపారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ టోంబ్రే మారుతి, శ్రీను, ఇప్ప శంకర్, కంబ్రే శ్యంరావు, గ్రామ పంచాయితీ కార్యదర్శి ఆసిఫ్ అలీ, సిబ్బంది విలాస్, వెంకటి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సింగరేణి డైరెక్టర్

నవతెలంగాణ-నస్పూర్



మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్‌ను సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్) బలరాం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి ఏరియాలలో భూసేకరణ సంబంధించిన పలు అంశములపై కూలంకషంగా చర్చించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఎస్టేటస్ రవి ప్రసాద్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, బెల్లంపల్లి జనరల్ మేనేజర్ దేవేందర్, మందమర్రి జనరల్ మేనేజర్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల సందర్శన

నవతెలంగాణ-తాండూర్



ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ స్పెషల్ ఆఫీసర్ గజానంద్‌తో కలిసి మండలంలోని కొత్తపెల్లి, రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీను సోమవారం సందర్శించారు. నర్సరీ మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. డంపింగ్ యార్డులలోతడి పొడి చెత్త సేకరణ పట్ల నిర్లక్ష్యం చూపరాదన్నారు. వర్మీ కంపోస్ట్ తయారీలో శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ నగర్ పంచాయతీ సెక్రెటరీ కల్పన కొత్తపెల్లి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి బీఆర్ఎస్ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు జిల్లా కేంద్రంలోని టాటియా గార్డెన్‌లో నిర్వహించే బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ఎమ్మెల్యే ఆత్రం సక్కులు సూచించారు. పార్టీ నాయకులతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. నిర్వాహకులకు పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భావ సభ మంగళవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి జిల్లాలోని పార్టీకి సంబంధించిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, వైస్ ఎంపీపీలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, జడ్పీటీసీ డాక్టర్ అజయ్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గదవేని మల్లేష్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్, ఆసిఫాబాద్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు హైమద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సలాం, జీవన్, శ్రీనివాస్, నజీర్, షబ్బీర్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సోమవారం రెండవ విడత గొర్రెల పంపిణీ పథకంపై 13 గ్రామ పంచాయితీలకు చెందిన సొసైటీస్, అధ్యక్షులు, యాదవులకు, గొర్రెల కాపరులు, రైతులకు జిల్లా పశు వైద్య , పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వై.రమేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఈ.శంకర్, ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా డీడీలు కట్టడం, గొర్రెల ఎంపిక, ట్రాన్స్‌పోర్ట్, సొసైటీ ఎన్నికలు నిర్వహణ, పశుపోషణ, పచ్చి మేత పెంపకం, వేసవి కాలంలో పశువులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన రైతులకు అవగాహన కల్పించామని అన్నారు. కార్యక్రమంలో జన్నారం మండల పశు వైద్య అధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్, ఇంధన్ పల్లే, తపాల్పూర్ పశు వైద్య అధికారులు, డా. రాజు కుమార్, డా.కిరణ్ కుమార్ సిబ్బంది, యాదవ సంఘం మండల అధ్యక్షులు బొంతల మల్లేష్, ఉపాధ్యక్షుడు సందినేని నర్సయ్య, సెక్రటరీ ఆవుల రాజన్న, మండల యూత్ అధ్యక్షులు గొట్ల రాజేష్ యాదవ్, డైరెక్టర్ రాయమల్లు, కిష్టాపూర్ అధ్యక్షుడు- గట్టు మహేష్, లింగయ్య, నరేష్, మురిమడుగు ఏ.రాజేష్, తపాలపూర్ పన్నాల గోపాల్, చింతలపల్లి యాదగిరి, తిరుపతి, కవ్వాల్ వంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్ఓ టు జీఎం త్యాగరాజన్‌కు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ ఓ టు జీఎంగా పనిచేసి పదవి విరమణ పొందుతున్న త్యాగరాజన్‌కు సీసీసీ సింగరేణి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపకం అందజేశారు. మహా సమ్మేళనం సమన్వయ కర్త సి.రాజి రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు జరుపుకున్న మహాసమ్మేళనం సమయం నుండి ఇప్పటివరకు వారు బడి కోసం చేసిన సేవలను కొనియాడారు. వారి గురించి చక్కటి కవిత్వం వ్రాసి వారికి వినిపించారు. గతంలో పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని లేదా పేద విద్యార్థులను ఆదుకుంటామని తెలిపిన ప్రకారం ఈ సంవత్సరం ఐదుగురు విద్యార్థులకు ఫీజు చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్ రావు, సంయుక్త కార్యదర్శి జక్కుల మల్లేష్, పెండ్లి సురేందర్, ఎస్ కుమార్, గోశిక మనోజ్ కుమార్, కోరెపు తిరుపతి, కృష్ణవేణి, రాధిక శర్మ, శ్రావణి పాల్గొన్నారు.

ఇంటింటా వాసవీ మాతా పారాయణం

జన్నారం : మండల ఆర్య వైశ్య మహిళల ఆధ్వర్యంలో ఇంటింటా వాసవీ మాత పారాయణం చేపట్టారు. ఈ నెల 30వ తేదీన ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి మాత జన్మదిన సందర్భంగా ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో ఇంటింటా వాసవి మాత పారాయణం చేయాలని సంకల్పించారు. వాసవీ మాత జన్మదిన సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి రోజు ఒక్కొక్కరి ఇంట్లో వాసవీ మాత పారాయణం చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రతి రోజు ఆర్యవైశ్యుల ఇంటి వద్ద సాయంత్రం 6.30 నుండి 8 గంటల వరకు వాసవీ మాత పారాయణం చేస్తున్నారు. ఈ నెల 30న వాసవీ మాత జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని మెదరివాడ లోని శ్రీ మహాలక్ష్మి ఆలయంలో కుంకుమ పూజలు, నగర సంకీర్తన, పెద్ద ఎత్తున పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

చింతలమానేపల్లి : ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం మండంలోని కర్జెల్లి గ్రామ పంచాయతీ భవనంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య ప్రారంభించారు. ఈ శిబిరంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డోకే రాజన్న నేత్ర పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో కంటి చూపు లోపిస్తుందని సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం తరపున ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మొదటి విడత విజయవంతం ఐయ్యిందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులు వైద్య సిబ్బంది కంటి వెలుగు కార్యక్రమం లక్ష్యసాధన దిశగా ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని, అందరికీ కళ్లద్దాలు అందేలా చూడాలన్నారు. కర్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు నాజీమ్ హుసేన్, రైతు సమన్వయ మండల అధ్యక్షులు బింకరి నారాయణ, కర్జవెల్లి గ్రామ సర్పంచ్ నానాయ్య, ఎంపీడీఓ మహేందర్ పాల్గొన్నారు.

26న వికలాంగుల మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ - కౌటాల

ఈ నెల 26న మహబూబాబాద్‌లో నిర్వహించే వికలాంగుల పెన్షన్ పోరాట సమితి సభను విజయవంతం చేయాలని వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బన్న మూర్తి, మండలాధ్యక్షుడు గొడిసెల రాజేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం వాల్‌పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 26న మహబూబాబాద్‌లో నిర్వహించే వికలాంగుల పెన్షన్ పోరాట సభకు జిల్లా నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వికలాంగులకు నెలకు రూ.6వేల పెన్షన్ అందించడానికి ఈ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ ఉన్నారు.

కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎంపీ నగేష్

నవతెలంగాణ-తలమడుగు

సుంకిడి ఉపసర్పంచ్ అల్లూరి శేఖర్‌రెడ్డి కూతురుకు ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకొని మాజీ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ సోమవారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన నిమ్మల రాజారెడ్డి అనారోగ్యంతో మరణించగా కుమారుడు నిమ్మల దశరథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నగేష్ వెంట స్థానిక సర్పంచ్ మహేందర్ యాదవ్, సీనియర్ నాయకులు కనపర్తి చంద్రకాంత్, బోండ్ల వెంకటస్వామి, గడ్డం దేవారెడ్డి, నారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, చిన్న గంగారెడ్డి, పెద్ద గంగారెడ్డి ఉన్నారు.



మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు పండించిన మొక్కజొన్న పంటను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బొర్రన్న మాట్లాడుతూ జిల్లాలో దాదాపుగా 14వేల ఎకరాలకు పైగా సాగుచేస్తే పంట దిగుబడి దాదాపుగా 5నుండి 6లక్షల క్వింటాల వరకు వచ్చిందన్నారు. కొన్ని మారుమూల గ్రామాల రైతుల దగ్గర నుండి ఒక క్వింటల్‌కు 14వందల నుండి 15వందల రూపాయల వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధర రూ.1962 ఉంటే ఒక్కొక్క రైతు క్వింటల్‌కు రూ.4 వందల నుండి రూ.5వందల వరకు నష్టపోతున్నాడని తెలిపారు. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేయాల్సిన అవసరముందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పుడేమో అదే రైతుని పాలేరుగా మార్చే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పూర్తిస్థాయిలో మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే అకాల వర్షాలు, వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఆందోళన స్థలానికి మార్క్‌ఫెడ్ డీఎంఓ వచ్చి మూడు రోజుల వరకు పంటలను ప్రయివేటు వ్యాపారస్తులకు అమ్ముకోవద్దని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు రాజు, ప్రవీణ్, వెంకటరమణ, ఆశన్న, శంకర్ పాల్గొన్నారు.

పీడీఎఫ్ బదిలీ వర్కర్లకే సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఇవ్వాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్టులకు తమ భూమిని, ఇండ్లను కోల్పోవడం వల్ల సింగరేణిలో బదిలీ వర్కర్లకు ఉద్యోగం ఇచ్చి మందమర్రి ఏరియాకు బదిలీ చేశారని, ప్రస్తుతం మందమర్రిలో పనిచేసే సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌లకు బెల్లంపల్లి ఏరియాలో ప్రకటించిన సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులకు పీడీఎఫ్ బదిలీ వర్కర్లకే ఇవ్వాలని మ॥రాజ్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. సోమవారం గోలేటిలోని టీబీజీకేయస్ యూనియన్ కార్యాలయంలో నాయకులను కలిసి పీడీఎఫ్ బదిలీ వర్కర్లకే బెల్లంపల్లి ఏరియాలో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులు ఇప్పించే విధంగా కృషి చేయాలని కోరారు. టీబీజీకేయస్ సెంట్రల్ కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంఘం ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఎమ్మెల్యే, టీబీజీకేయస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎఫ్ బదిలీ వర్కర్లు దామోదర్, మల్కు, తిరుపతి, బాజీరావు, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

200 రోజులు ఉపాధి పనులు కల్పించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్

గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విస్తరించి పని రోజులను 200కు పెంచాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. సోమవారం అనుకోడలో గ్రామీణ ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కనీస వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు పని ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని, దెబ్బలు తగిలిన వారికి ప్రథమ చికిత్స జరిపే విధంగా ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బకు గురి కాకుండా సేద తీర్చుకోవడానికి టెంట్ వేయాలని, కూలీలు ప్రమాదాలకు గురి కాక ముందే ఉన్నతాధికారులు తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఇద్దరు కూలీలు గాయాల పాలయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి ప్లీనరీని విజయవంతం చేయాలి

నవతెలంగాణ- కడెం

బీఆర్ఎస్ అధిష్టానం ఆదేశం మేరకు మంగళవారం అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగరేయాలని, అనంతరం నియోజకవర్గ ప్లీనరీ సమావేశానికి మండల కేంద్రానికి రావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. ఎమ్మెల్యే అజ్మీర రేఖానాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ప్లీనరీ సమావేశం నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ మండల నాయకులు, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్, జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపిటిసిలు ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అకాల వర్షం..అపార నష్టం..!

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలో కురిసిన వడగండ్ల వర్షాలకు వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. వరుసగా మూడు రోజులపాటు ఉదయం ఎండ ఉండగా, సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఈదురుగాలుల ధాటికి మండలంలోని మోసం, ఆరెగూడ, సీతానగర్, గజ్జిగూడ, గువ్వలగూడ, నజ్రూల్‌నగర్ గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. గిట్టుబాటు ధర కోసం ఎదురుచూస్తూ పత్తిని విక్రయించకుండా ఇళ్లల్లో నిల్వచేసిన పత్తి వర్షానికి తడిసింది. వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలరాలాయి. నజ్రూల్‌నగర్, జంబుగలోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. విలేజి నెం.7 శివారులో అమిత్ మండల్ ఏర్పాటు చేసిన కడక్‌నాథ్ కోళ్ల ఫారం షెడ్డు గాలికి కొట్టుకుపోయింది. సుమారు మూడు వేల కోళ్లు మృతి చెందినట్లు అమిత్ మండల్ తెలిపారు. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో రెండు రోజులుగా మోసం, ఆరెగూడ, గజ్జిగూడ, గువ్వల, నాగంపేట జంబుగా, రాస్పెల్లి తదితర గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి.

వ్యవసాయశాఖ సర్వే

మూడు రోజులుగా కురిసిన వడగళ్ల వానలకు దెబ్బతిన్న పంటలను సోమవారం వ్యవసాయశాఖ అధికారులు సందర్శించి సర్వే చేశారు. గన్నారం, అనుకోడ, మోసం, ఆరెగూడ, గ్రామాల్లో ఏడీఏ మనోహర్, ఏఓ రామకృష్ణ నష్టం జరిగిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులు వివరాలు నమోదు చేశారు. నష్టం జరిగిన పంటల వివరాలను అంచనా వేసి రెండు రోజుల్లో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపిస్తామని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. ఏఈఓలు నష్టం జరిగిన ప్రతి పంట పొలానికి వెళ్లి వివరాలను సేకరించాలని ఏఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పురుషోత్తం, శ్రీనివాస్, వికాస్, ఎంపీటీసీలు అమిత్ కుమార్, ఉప సర్పంచ్ సంతోష్, రైతులు పాల్గొన్నారు.

రైతుల రాస్తారోకో

అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆరెగూడ గ్రామస్తులు ప్రధాన రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. రెండు రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షం కారణంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం కలిగిందని, ఏ ఒక్క అధికారి వచ్చిన పాపన పోలేదని, కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఇక్కడి నుండి వెళ్లేది లేదని రోడ్డుపై బైటాయించారు.



కాగజ్‌నగర్‌లో దెబ్బతిన్న పంట



మృతి చెందిన కోళ్లు

ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలి

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకులు పాల్వాయి హరీష్ డిమాండ్ చేశారు. రైతుల ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. హరీష్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో అకాల వర్షాల వల్ల చేతికొచ్చే పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఎకరానికి రూ.30 వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈదురు గాలులకు ఇండ్లు ధ్వంసమై దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న వారికి తక్షణం సహాయం చేయాలన్నారు.

పెంచికల్‌పేట్ : ఆదివారం ఈదుగాలులు, వడగండ్లతో కూడిన అకాల వర్షానికి రైతులకు అపార నష్టం జరిగింది. మండల వ్యాప్తంగా కురిసిన అకాల వర్షానికి కోత దశలో ఉన్న వరి పైరు నేల కొరిగింది. గాలి, వానతో మండలంలో అంధకారం నెలకొంది. విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

2200 ఎకరాల్లో పంట నష్టం

మండలంలో యాసంగి వరి పంటను 2750 ఎకరాల్లో సాగు చేయగా ఆదివారం కురిసిన అకాల వర్షానికి సుమారు 2200 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి రాజులనాయుడు తెలిపారు. సోమవారం వ్యవసాయ విస్తరణ అధికారులు గౌసియాబేగం, లావణ్యతో కలిసి పంట పొలాలను పరిశీలించి రైతులు నష్టపోయిన వరి పంట వివరాలపై అధికారులకు నివేదిక అందించనున్నట్టు తెలిపారు. అకాల వర్షంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షానికి మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గాలి, వానతో పలుచోట్ల విద్యుత్ వైర్లపై చెట్లు విరిగి పడడంతో వైర్లు తెగిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు సోమవారం విద్యుత్ సరఫరా పునరుద్ధరించడానికి శాయశక్తుల కృషి చేస్తున్నారు. అకాల వర్షంతో నష్టపోయిన పంటలను సర్వేచేయించి ప్రభుత్వం పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. నివేదికలకే పరిమితం కాకుండా ప్రభుత్వం స్పందించి పంట నష్టం అందించాలని వారు కోరుతున్నారు. వర్షాకాలంలో పెద్దవాగు ఉధృతితో నష్టపోయిన పంటలను సర్వే చేసినప్పటికీ పంట నష్టం నేటకీ అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పెంచికల్‌పేట్‌లో పంట నష్టం సర్వే చేస్తున్న వ్యవసాయాధికారులు



కాగజ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న రైతులు

రెగ్యులరైజ్ చేసే వరకూ పోరాటం



నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, ఓపీఎస్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేసేంతవరకు పోరాటం ఆపేదిలేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఓపీఎస్ కార్యదర్శులు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు పోస్టు కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేండ్ల నుండి తమతో వెట్టిచాకిరి చేయించుకుంటోంది తప్ప దీర్ఘకాలిక సమస్య అయిన రెగ్యులరైజ్ విషయంలో ఉలుకు పలుకు లేకుండా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పథకాల అమలు, వివిధ పనుల భారం మోపుతూ తమపై వివక్ష చూపడం సరైంది కాదన్నారు. నాలుగేండ్ల ప్రొబిషన్ కాలం పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించడం లేదని, 13 రోజుల నుండి నిరసన తెలుపుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దిలీప్ సర్కార్, సాహిమా, హరీష్, లక్ష్మి, మౌనిక, ప్రవీన్, రోజ్‌మేరి, సాయికృష్ణ, సందీప్, శివాని, శివకృష్ణ పాల్గొన్నారు.

మాసాడి శ్రీదేవిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తాండూర్

బోయపల్లి ఎంపీటీసీ సభ్యురాలు బుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవిని సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. శ్రీదేవి హైదరాబాదులోని ప్రయివేటు ఆస్పత్రిలో మెదడు శస్త్ర చికిత్స చేసుకున్న నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితి మెరుగుపడి డిశ్చార్జి అయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీదేవిని పరామర్శించారు.

నేడు మెగా జాబ్ మేళా

ఆసిఫాబాద్ : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో 40కు పైగా ప్రైవేట్ కంపెనీలలో 3,500 పైగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. హ్యాపీ మొబైల్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ కార్డ్స్, అపోలో ఫార్మసీ, డీ మార్ట్, రిలయన్స్ జియో మార్ట్, ముత్తూట్ గ్రూప్ తదితర కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లా కేంద్రంలో కోర్టు ఎదురుగా గల జిల్లా బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు తమ విద్యార్హత ధృవపత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని తీసుకొని హాజరుకావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ - రెబ్బెన

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. సోమవారం మండలంలోని నారాయణపూర్ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏండ్లు పైబడిన వారందరు కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందిస్తారన్నారు. కంటికి సంబంధించిన ఏ చిన్న సమస్యలున్నా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో నారాయణపూర్ సర్పంచ్ వేముర్ల అమృత, కిష్టాపూర్ ఎంపీటీసీ దుర్గం రాము, ఉప సర్పంచ్ మాదాస్ రవీందర్, వార్డు సభ్యుడు శ్రీనివాస్, డాక్టర్ రాకేష్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



పోలీస్‌స్టేషన్‌కు వివిధ సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీసుస్టేషన్‌ల పరిశీలించారు. బాధితులకు న్యాయం చేసేందుకు పోలీసు అధికారులు దగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కన్నెపల్లి, గూడెం, నంబాల, వెలగనూరు, కాసిపేట్, పెద్దపేట, మామిడిపల్లి, లింగాపూర్, తాళ్లపేట గ్రామాలలో సహకార సంఘం, డీసీఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దయాకర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోరారు. రైతులు ధాన్యం అమ్మడానికి దూర ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మొదటి రకం వరి ధాన్యానికి రూ.2060, రెండవ రకానికి రూ.2040 చొప్పున ప్రభుత్వమే నేరుగా రైతుల ఖాతాలో వేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో ఏ పంటకు విలువ ఉందో తెలుసుకొని దానికి అనుగుణంగా పంటలు వేసుకోవాలని సూచించారు.

ఎన్నికల ఫారంపై అవగాహన



నవతెలంగాణ - సిర్పూర్(టి)

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తహసీల్దార్ రియాజ్ అలీ ఆధ్వర్యంలో సోమవారం వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు, ప్రజాప్రతినిధులకు నూతన ఎలక్షన్ ఫారం 6(బి), 7, 8 ఫారాలపై అవగాహన కల్పించారు. నూతనంగా ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవడానికి, తొలగించడానికి తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. బీఎల్‌ఓలకు, తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి తమవంతు బాధ్యతగా సహకరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ షికిల్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, ఎంపీటీసీ సోయల్ హైమద్, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ సత్యనారాయణ, రైతు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేపూరి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మద్దిమాడలో చేనేని భీమయ్య వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మద్దిమాడ గ్రామంలో సోమవారం చేనేని భీమయ్య 35వ వర్ధంతిని ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గిరిజనుల సాంప్రదాయ పద్ధతిలో చేనేని భీమయ్య కుటుంబ సభ్యుల ఇంటి వద్ద నుంచి పూజా సామాగ్రితో ర్యాలీగా వచ్చి భీమయ్య విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు, ఆదివాసీ నేతలు ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మాట్లాడారు. ఇళ్ల నిర్మించుకునేందుకు కర్ర కోసం అడవికి వెళ్లి తెచ్చుకుంటుండగా, అమానుషంగా కాల్పులు జరిపి చేనేని భీమయ్యను పొట్టన పెట్టుకున్నారన్నారు. శరీరంలో తూటా దిగినా ఆదివాసీ గిరిజన ప్రతిమ చూపి వీర మరణం పొందిన చేనేని భీమయ్య ప్రాణత్యాగం చేసి అమరుడైనాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య. సర్పంచ్ ఆడె జంగు, నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి కొమ్ముల బాపు, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు సోయం జంగు, జిల్లా అధ్యక్షుడు మడావి వెంకటేశ్, ఉపాధ్యాక్షుడు కనక రాజు, రొడ్డ రమేశ్, భీమిని మహేందర్, మంగ శ్రీకాంత్, రెడ్డి లక్ష్మణ్, సోమని పోషక్క, నాయిడి మల్లేశ్, సంద్ర భూమయ్య, లవుడం నవీన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 25న మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని తెలిపారు. దీనివల్ల సంజయ్‌నగర్ ఏరియాలో విద్యుత్తు అంతరాయం ఉంటుందన్నారు. దీనికి విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.